క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి సహకరించండి



పటమట(విజయవాడతూర్పు): డివిజన్లలో సమస్యల పరిష్కారానికి అధికారులు కార్పొరేటర్లకు సహకారం అందించాలని వీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ వెంకట సత్యం కోరారు. శుక్రవారం ఆయన వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లతో కలిసి వీఎంసీ కమిషనర్ ధ్యాన చంద్రను కలిశారు. తమ డివిజన్లలో ఉన్న సమస్యలపై, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్‌ను కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరాన్ని అభివృద్ధి చేయడానికి తాను కౌన్సిల్ సభ్యులకు సహకరిస్తామని పేర్కొన్నారు.

శాకంబరీదేవిగా నాగమానసాదేవి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీషిర్డీ నాగసాయిబాబా, నాగమానసాదేవి మందిరంలో శుక్రవారం అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించారు. భక్తులు కూరగాయలు, పండ్లు, పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందిరంలో మూడు రోజులపాటు శాకంబరీదేవి ఉత్సవాలు నిర్వహిస్తామని, ఆదివారం అన్న ప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వెన్నా ఆంజనేయులు, రమాదేవి దంపతులు, పద్మ, ఇందిర, భవానీ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో యువతికి వేధింపులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రేమ పేరుతో యువతిని వేధింపులకు గురిచేసిన వ్యక్తిపై సింగ్‌నగర్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదు అయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన యువతి(28) సిటీ ఆర్థోపెడిక్ సెంటర్‌లో పనిచేస్తుంది. అయితే బందరు రోడ్డులోని ఓ గోల్డ్ షాప్‌లో పనిచేస్తున్న రేవంత్ అనే వ్యక్తి గత మూడు నెలల నుంచి ఆమె వెంటపడి ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం శిఖామణి సెంటర్‌లో యువతిని అడ్డగించి నేను నిన్ను ప్రేమిస్తున్నాను.. నువ్వు కూడా నన్ను ప్రేమించు లేకపోతే నిన్ను వదలిపెట్టనంటూ బెదిరించాడు. ఈ నెల ఒకటో తేదీన కూడా మరోసారి ఆమెను అడ్డగించి బెదిరించాడు. దీంతో యువతి కుటుంబ సభ్యులతో కలిసి సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హోంగార్డ్ కుటుంబానికి ఆర్థిక సాయం



విజయవాడస్పోర్ట్స్: జిల్లా పోలీస్ కమిషనరేట్ హోంగార్డ్స్ యూనిట్ నందు విధులు నిర్వర్తిస్తూ ఇటీవల మృతి చెందిన యాగంటి కోటేశ్వరరావు, మోహనరావు కుటుంబాలకు కమిషనరేట్‌లో పని చేస్తున్న తోటి హోంగార్డులు బాసటగా నిలిచారు. మృతుల కుటుంబాల ఆర్థిక ఆసరాకు హోంగార్డ్‌లు అందరూ కలిసి వారి ఒక్క రోజు వేతనాన్ని సమకూర్చారు. ఈ నగదు చెక్కులను పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు చేతుల మీదుగా కమిషనరేట్‌లో కోటేశ్వరరావు భార్య నాగలక్ష్మికి, మోహనరావు భార్య ప్రమీలకు ఒక్కొక్కరికి రూ. 5 లక్షల చొప్పున శుక్రవారం అందజేశారు.

బాపు మ్యూజియంలో చేనేత హస్తకళా ప్రదర్శన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆషాఢ, శ్రావణ మాసాలను పురస్కరించుకుని బందరు రోడ్డులోని బాపు మ్యూజియంలో చేనేత హస్తకళా ప్రదర్శన ప్రారంభమైంది. ఈ ప్రదర్శనను మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ ప్రారంభించారు. ప్రదర్శన, అమ్మకాలు సెప్టెంబర్ 8వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ప్రదర్శనలో పోచంపల్లి, నారాయణ్‌పేట, ఉప్పాడ, చీరాల, మంగళగిరి, కలంకారీ, ఫ్యాన్సీ, ఖాదీ, కాటన్ ప్రింటెడ్, బెంగాల్ సిల్క్, కాంత్ వర్క్ కాటన్, భాగల్‌పూర్ సిల్క్, బాంధినీ సిల్క్, గుజరాత్ డిజైన్ టాప్స్, లక్నో చికన్ వర్క్, డోర్ కర్టెన్స్, డోర్ మ్యాట్స్, వరంగల్ టవల్స్, బెడ్‌షీట్స్, రాజస్థానీ ప్రింటెడ్ టాప్స్, జైపూర్ టాప్స్, బెడ్‌షీట్స్, ఖాదీ షర్ట్స్, సహరన్‌పూర్ ఉడ్ ఐటమ్స్ అందుబాటులో ఉన్నాయన్నారు.

జగన్మాతా.. కాపాడమ్మా..





ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మ సన్నిధిలో ఆషాఢ మాసోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారికి సారె సమర్పించేందుకు తరలివస్తున్నారు. భక్త, భజన, ఆధ్యాత్మిక బృందాలు శుక్రవారం ఇంద్రకీలాద్రికి చేరుకొని దుర్గమ్మకు సారె సమర్పించారు. కొందరు మహిళలు మెట్ల పూజ చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. జగన్మాతా...మమ్మల్ని కాపాడమ్మా అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. భారీగా తరలివచ్చిన భక్తులతో కొండంతా పండుగ వాతావరణం నెలకొంది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







● అధినేతతో ఆత్మీయ భేటీ



వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, సెంట్రల్ మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులు కలిశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

కమిటీ కుర్రోళ్లు అందరినీ ఆకట్టుకుంటుంది

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఈ నెల 9న విడుదల కానున్న కమిటీ కుర్రోళ్లు చిత్రం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుందని ఆ చిత్ర నిర్మాత కొణిదెల నిహారిక అన్నారు. ఈ చిత్రాన్ని 90లో కిడ్స్ భావోద్వేగాలను తెలుపుతూ దర్శకుడు యదు వంశీ చిత్రీకరించారని తెలిపారు. ప్రతి ఒక్కరూ వీక్షించి తమను ఆదరించాలని కోరారు. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా ఆ సినిమా యూనిట్ సభ్యులు శుక్రవారం నగరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిర్మాత నిహారిక మాట్లాడారు. ఈ సినిమాతో 20 మంది కొత్త కుర్రోళ్లు ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నారని చెప్పారు. ఈ సినిమా ట్రైలర్ అందరినీ ఆకట్టుకున్నట్లు పేర్కొన్నారు. కమిటీ కుర్రోళ్లు కోసం మూడేళ్లుగా పనిచేస్తూనే ఉన్నట్లు తెలిపారు. డైరెక్టర్ యదు వంశీ మాట్లాడుతూ విలేజ్‌లో కొంత మంది చిన్నప్పటి నుంచి టీనేజ్, యువకులుగా మారే స్థాయి వరకూ వివిధ దశల్లో వారి మధ్య చోటుచేసుకున్న సంఘటన నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పలువురు నటీనటులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న చిత్ర నిర్మాత నిహారిక, పక్కన దర్శకుడు యదు వంశీ తదితరులు

శివకామేశ్వరీ పీఠంలో మాస శివరాత్రి

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శుక్రవారం మాస శివరాత్రి పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అన్నాభిషేకం, అర్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ సెక్షన్ 11కేవీ దుర్గాపురం ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గాపురం, రజక స్ట్రీట్, సాంబమూర్తి రోడ్డు, పొండ్రి స్ట్రీట్, గణపతి స్ట్రీట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో నటి నిహారిక



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సినీనటి, నిర్మాత నిహారిక శుక్రవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన నిహారికను ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ ఈఓ రామరావు అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

తల్లిపాలు అమృతతుల్యం



32వ డివిజన్‌లో తల్లిపాల వారోత్సవాల అవగాహన ర్యాలీ



దుర్గాపురం అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ సృజన

మధురానగర్(విజయవాడసెంట్రల్): తల్లిపాలు అమృత తుల్యం అని ప్రతీ తల్లి తమ బిడ్డకు తల్లి పాలు తప్పక ఇవ్వాలని 32వ డివిజన్ కార్పొరేటర్ చన్నగిరి రామ్మోహనరావు అన్నారు. స్థానిక 32వ డివిజన్ అయోధ్యనగర్‌లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అవంతితో కలిసి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ పేద, ధనిక తారతమ్యం లేకుండా ప్రతీ తల్లి బిడ్డకు ఇవ్వగలిగేది తల్లిపాలు మాత్రమేనని అన్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అవంతి మాట్లాడుతూ ప్రతీ తల్లి తమ బిడ్డలకు తల్లిపాలు ఇవ్వడం ద్వారా సహజ సిద్ధమైన వ్యాధి నిరోధక శక్తిని అందించవచ్చునని పేర్కొన్నారు. బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశాలు తగ్గుతాయని తెలిపారు. ఆరోగ్యకేంద్రం సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దుర్గాపురంలో..

స్థానిక 27వ డివిజన్ దుర్గాపురంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అవగాహన ర్యాలీ, అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ సృజన తల్లిపాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలు ఇవ్వకపోవడం వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. తల్లిపాలపై అపోహలను తొలగించేందుకు ప్రతీ ఏటా తల్లిపాల వారోత్సవాల పేరిట అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్యకేంద్రం సిబ్బంది, హెల్త్ సెక్రటరీలు, అంగన్‌వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే దోమల నియంత్రణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): సమష్టి కృషితోనే దోమల నియంత్రణ సాధ్యమని కావున ప్రతి ఒక్కరూ దోమల నియంత్రణకు తమ వంతు సహాయ సహకారం అందించాలని 32వ డివిజన్ కార్పొరేటర్ చన్నగిరి రామ్మోహనరావు అన్నారు. స్థానిక 32వ డివిజన్‌లో శుక్రవారం డ్రైడే–ఫ్రైడే అవగాహన ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం దోమల నివారణ చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఏసీపీ జగదీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



26వ డివిజన్‌లో అవగాహన ర్యాలీ

ప్రతి ఒక్కరూ డ్రైడే పాటించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ వారంలో ఒక రోజు డ్రైడేగా పాటించి ఇంట్లోని నీటి నిల్వలను మార్చాలని 26వ డివిజన్ కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి సూచించారు. స్థానిక 26వ డివిజన్ చుట్టుగుంటలో శుక్రవారం డ్రైడే–ఫ్రైడే అవగాహన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటి నిల్వల వల్ల దోమలు పెరిగే అవకాశం ఉందన్నారు. కాబట్టి ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఇంటి వద్ద పూల కుండీలు, పాత టైర్లు తదితర వాటిలో నీరు నిలిచిపోయి దోమలార్వా పెరుగుతుందని వివరించారు. అనంతరం దోమల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ సెక్రటరీ లలిత భార్గవి, నాయకులు వల్లభనేని సతీష్, తోట పాండు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాయకాపురం(విజయవాడరూరల్): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని 64వ డివిజన్ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ పేర్కొన్నారు. డ్రైడే–ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వికేజి కండ్రికలో డెంగ్యూ వ్యతిరేక ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరిచేరవని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆ విధంగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. డాక్టర్ రమ్య, కోఆర్డినేటర్ జగదీశ్వరి, కమ్యూనిటీ ఆర్గనైజర్ మణి, ఏఎన్ఎమ్‌లు, ఆశా వర్కర్లు, శానిటరి ఇన్‌స్పెక్టర్ గోపిరాజు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ మహిళా కళాశాలలో శుక్రవారం మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. మాదకద్రవ్యాలతో ఆరోగ్యం పాడవడమేగాక కుటుంబాలు సైతం నాశనం అవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోస్టర్ మేకింగ్, శీర్షికలు, నినాదాల పోటీలో విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. అనంతరం కంప్యూటర్ సైన్సు విభాగం వారు నిర్వహించే 'మల్టీమీడియా ఎడిటింగ్ టూల్స్' అనే సర్టిఫికెట్ కోర్సు పోస్టర్‌ను ప్రిన్సిపాల్ విడుదల చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు అరుణ, సుధారాణి, లావణ్య, నాగలక్ష్మి, సుమిత్ర, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణపై సుప్రీం తీర్పును తక్షణమే అమలు చేయాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోకన్వీనర్ మానికొండ శ్రీధర్ మాదిగ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోకన్వీనర్ మానికొండ శ్రీధర్ మాదిగ డిమాండ్ చేశారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం దగ్గర ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి శుక్రవారం పాలాభిషేకం చేశారు. వర్గీకరణ పోరాటంలో అసువులు బాసిన మాదిగ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీం తీర్పుతో ఆగస్టు ఒకటో తేదీనే దేశంలోని మాదిగ, మాదిగ ఉప కులాలకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన వెంటనే తెలంగాణ ముఖ్యమంత్రి స్పందిస్తూ ఈ క్షణం నుంచే వర్గీకరణ అమలు చేస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. అదేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పును మంద కృష్ణ మాదిగ ఖాతాలో వేసుకుని సంబరాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 20 ఏళ్లలో ఆయన ఏ రోజూ కోర్టుకు వెళ్లలేదని, సరిగ్గా తీర్పు వెలువడటానికి నెల రోజుల ముందు నుంచి హడావిడి చేస్తున్నారన్నారు. వర్గీకరణ ఉద్యమంలో ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తల త్యాగాల వల్లే ఈ రోజు చారిత్రాత్మక తీర్పు లభించిందన్నారు. వర్గీకరణ పోరాటంలో అసువులు బాసిన మాదిగ అమరవీరులకు తీర్పును అంకితం ఇస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వైఎస్ రాజు మాదిగ, గద్దపాటి ప్రసాద్ మాదిగ, మనోహర్ మాదిగ, మాతంగి సంజయ్ మాదిగ, వీర్ల అన్వేష్ మాదిగ, చొక్కా సురేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న శ్రీధర్ మాదిగ

జాతీయోద్యమంలో పింగళి పాత్ర చిరస్మరణీయం

విజయవాడ కల్చరల్: జాతీయ ఉద్యమంలో పింగళి వెంకయ్య పాత్ర చిరస్మరణీయమైనదని అంతర్జాతీయ వాసవి క్లబ్ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. ఏపీ నటీనట వృత్తి కళాకారుల సంఘం, పింగళి వెంకయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన శుక్రవారం బాపూ మ్యూజియంలోని పింగళి వెంకయ్య విగ్రహం వద్ద 148వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు పింగళి విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ తెలుగు వారి కీర్తి పతాకాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు పింగళి వెంకయ్య అని అభివర్ణించారు. మహాత్మా గాంధీ అనుచరునిగా జాతీయ జెండాకు రూపకల్పన చేశారన్నారు. నగరంలోని విక్టోరియా మ్యూజియంలోనే జాతీయ జెండా ఆవిర్భావం జరిగిందని తెలిపారు. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి గాయత్రి దేవి, వెంకయ్య కోడలు సుశీలమ్మ మాట్లాడుతూ పింగళి జీవితం ఆదర్శప్రాయమన్నారు. వేముల ఛారిటీస్ కోఆర్డినేటర్ చలమయ్య, విక్టోరియా మ్యూజియం సిబ్బంది, ఏపీ ఎన్‌జీవో సభ్యుడు రాంబాబు పాల్గొన్నారు.



పింగళి వెంకయ్యకు నివాళులర్పిస్తున్న హజరత్తయ్య గుప్తా, గాయత్రి, పింగళి కోడలు సుశీల తదితరులు



పింగళి వెంకయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ సేవా సంఘం నేతలు

ఆకాశవాణి కేంద్రంలో జయంతి వేడుకలు

విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో శుక్రవారం జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రాంగణంలోని పింగళి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీడీజీ సోమేశ్వరరావు మాట్లాడుతూ నేటి తరం యువత పింగళి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పింగళి జీవిత విశేషాలు, మహాత్మా గాంధీతో ఉన్న అనుబంధం వివరించారు. జయంతి వేడుకల్లో ఆకాశవాణి కార్యక్రమ విభాగ అధిపతి బీ వెంకటేశ్వర్లు, ఏఓ సూర్యనారాయణ, కోపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ చుండూరి మాణిక్యాలరావు, ఆకాశవాణి సిబ్బంది పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకి భారతరత్న ప్రకటించాలి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని బ్రాహ్మణ సేవా సంఘం కార్యాలయంలో శుక్రవారం పింగళి వెంకయ్య 148వ జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కొప్పవరపు బలరామకృష్ణ పింగళి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశానికి అపురూపమైన జాతీయ పతాకాన్ని రూపొందించిన స్వాతంత్ర్య సమరయోధుడు, తెలుగు జాతికి విశేష గుర్తింపు తీసుకొచ్చిన పింగళి వెంకయ్యకి భారతరత్న ప్రకటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పింగళి వెంకయ్య జీవిత చరిత్ర గ్రంథాలను పంపిణీ చేశారు. సంఘ ఉపాధ్యక్షుడు ఈవని శ్రీరామచంద్రమూర్తి, కార్యదర్శి శ్రీతణుకు రామకృష్ణ, కోశాధికారి పెద్దిభొట్ల కాశీ విశ్వనాథం, జాయింట్ సెక్రటరి కొప్పరపు మారుతి, తనికెళ్ల దీక్షితులు, ప్రసాద్ పాల్గొన్నారు.

సిరివెన్నెలకు స్వరాంజలి

విజయవాడ కల్చరల్: గీతాంజలి మ్యూజికల్స్, సుశీల్ మీడియా, జీఎస్ మెలోడీస్ ఆధ్వర్యంలో సినీ గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రికి గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయకుడు సుశీల్‌కుమార్, వేటూరి పాటల పరిశోధకుడు డాక్టర్ జయంతి చక్రవర్తి, వెంకటేశ్వరరావు, రాజ్ కిషోర్, స్వాతి మీరాకుమార్, భారతి, రూపశ్రీలు సిరివెన్నెల రచించిన గీతాలను ఆలపించారు. గీతాంజలి మ్యూజికల్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ జయంతి చక్రవర్తి సిరివెన్నెల పాటల్లోని సాహిత్య విలువలను వివరించారు. సిరివెన్నెల చిత్రంతో సినీ ప్రస్థానం ప్రారంభించిన ఆయన వందలాది గీతాలను రచించారని పేర్కొన్నారు. అంతర్జాతీయ జానపద గాయకుడు దామోదర గణపతిరావు మాట్లాడుతూ తెలుగు పాటకు జాతీయ స్థాయి హోదా కల్పించిన మహోన్నత రచయిత సిరివెన్నెల అని అభివర్ణించారు.

విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు శుక్రవారం వైద్య సిబ్బంది హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. 61, 62, 63, 64వ డివిజన్లలోని పాఠశాలల్లో విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు రక్తశాతం పరీక్షలు నిర్వహించి తక్కువగా ఉన్న విద్యార్థులకు ఐరన్ టాబ్లెట్స్ ఉచితంగా అందజేశారు.